క్లుప్తంగా

ఉచిత మరుగుదొడ్లు ప్రారంభం

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్మల్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మరుగుదొడ్లను సోమవారం డిపో మేనేజర్ సాయన్న ప్రారంభించారు. మరుగుదొడ్డి వినియోగించినప్పుడు డబ్బులు అడిగితే 738284 2265 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ మోహన్, కె.మహేందర్‌రెడ్డి, కంట్రోలర్ శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సరుకులు అందజేత



సరుకులు అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: శ్రీస్వామి అవదూతానంద సరస్వతి మహరాజ్ ద్వితీయ పుణ్యతిథిని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అవదూతానంద సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఒకొక్కరికి రూ.500 విలువైన సరుకులను 45 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, సాయిభక్తులు అశోక్‌రావు, జి.శ్రీనివాస్, కొండాడి శరత్‌రావు తదితరులు ఉన్నారు.

పన్ను రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: పట్టణవాసులు ఆస్తిపన్నుపై రాయితీని సద్విని యోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఈనెల 30లోపు ఆస్తిపన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖానాపూర్: పట్టణంలో ఆస్తి, ఇంటి పన్నును ఈనెల 30లోగా చెల్లించి పన్నులో ఐదు శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు కోరారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఐదో తేదీలోగా తీసుకురావాలి

భైంసారూరల్: టోకెన్లు తీసుకున్న రైతులు ఈ నెల 5వ తేదీలోగా దేగాంలోని కొనుగోలు కేంద్రానికి శనగ పంటను తీసుకురావాలని మిర్జాపూర్ పీఏసీఎస్ సీఈవో తానాజీ పటేల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పంటను తీసుకొచ్చి విక్రయించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండలాధ్యక్షుడు అనిల్, మండల ఉపాధ్యక్షులు మోహినొద్దీన్, విజయ్, పీరాజీ తదితరులు ఉన్నారు.

పదోతరగతి విద్యార్థులకు బస్ సౌకర్యం

భైంసాటౌన్: భైంసాలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలుర వసతి గృహం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు వెళ్లేలా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు.

ఎరక్కపోయి ఇరుక్కున్న లేగదూడ



ప్రహరీ మధ్య ఇరుక్కున్న దూడ

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో గల బల్సు రాజేశ్వర్ ఇంటి ప్రహరీ మధ్య చిక్కుకున్న లేగదూడను ఫైర్ సిబ్బంది కాపాడారు. ఎప్పటిలాగే చిరుధాన్యాలు తినేందుకు వచ్చిన లేగదూడ ఇంటి ప్రహరీ సందులోకి వెళ్లి అందులో ఇరుక్కుపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో లేగదూడకు తాళ్లు కట్టి బయటకు తీసారు. ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు, లీడింగ్ ఫైర్‌మెన్ మోబిన్, డీయూపీ సత్తన్న, హోంగార్డు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

తానూరు: గ్రామాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నర్సరీల నిర్వహణతోపాటు హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగి పడేసిన బాటిళ్లలో నీటిని నింపుతూ..

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని వాటిని నిషేధించాలని అధికారులు చెబుతుంటారు. కలెక్టరేట్ గోడలపై ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు నిషేధమని రాతలతో దర్శనమిస్తున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, జిల్లా అధికారులు హాజరయ్యారు. వీరి కోసం సిబ్బంది మినరల్ వాటర్ బాటిళ్లను తీసుకురావాల్సి ఉంది. కానీ తాగి పడేసిన ఖాళీ బాటిళ్లలో నీటిని నింపి ప్రజావాణికి తీసుకొస్తుండగా సాక్షి క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఖాళీ వాటర్ బాటిళ్లు తీసుకొస్తున్న అటెండర్



తాగిపడేసిన వాటర్ బాటిళ్లలో నీటిని నింపుతూ..



జిల్లా అధికారుల కోసం టేబుల్‌పై నీటిని నింపి పెట్టిన బాటిళ్లు

ఆడబిడ్డలకు అండగా కేసీఆర్

- మంత్రి ఐకేరెడ్డి
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

లక్ష్మణచాంద: రాష్ట్రంలోని ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ మేనమామలాగా వ్యవహరిస్తూ వారు కష్టపడకుండా చూస్తున్నారని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కనకాపూర్ కేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో లక్ష్మణచాంద మండలానికి చెందిన 40 మంది, మామడ మండలానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు మంత్రి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి మహారాష్ట్ర నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఇంచార్జీ అల్లోల సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ కవితారెడ్డి, మామడ తహసీల్దార్ అరిఫా సుల్తానా, బీఆర్ఎస్ లక్ష్మణచాంద మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మామడ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, నాయకులు రాంచందర్, గంగారెడ్డి, లింగారెడ్డి, రమేశ్, జహీరొద్దీన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కనకాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఐకేరెడ్డిని సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సురేశ్‌రెడ్డి, సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వర్, మహేశ్, రవితేజ తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ దొడ్డి కొమరయ్య అడుగుజాడల్లో నడవాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాజూర గ్రామంలో దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ ముత్తగౌడ్, ఎంపీటీసీ నర్సవ్వ, కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారాం, కుర్మ సంఘం గ్రామ అధ్యక్షుడు భోజన్న, రాజేశ్వర్, భూమేశ్, సాయినాథ్, ముత్యం పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని దన్గరిగల్లీ సంఘ భవనంలో సోమవారం గొల్ల, కుర్మలు సోమవారం దొడ్డు కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, సంఘ సభ్యులు శంకర్, సాయినాథ్, విఠల్, పోతాజీ తదితరులు ఉన్నారు.



విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: మండలంలోని అంబకంటి, కుంటాల గ్రామాల్లో దొడ్డి కొమరయ్య విగ్రహానికి కుర్మసంఘం సభ్యులు నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, కన్వీనర్లు రవీందర్, భూమన్న, ఉపాధ్యక్షుడు అనిల్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు సాయన్న, దిగంబర్, పోతన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ఖానాపూర్: మండలంలోని 17 పంచాయతీల్లో సోమవారం ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని ఇన్‌చార్జి ఏపీఓ సట్ల రమేశ్ తెలిపారు. సోమవారం అటవీ ప్రాంతంలో కందకాల తవ్వకం, తదితర పనుల్లో 1,400 మంది కూలీలు పాల్గొన్నారని పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముధోల్: మండలంలోని సరస్వతీనగర్, పిప్రి, ముద్గల్ గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ సురేశ్ బాబు ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశాలకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. జాబ్ కార్డులు లేనివారు జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ ఆత్మస్వరూప్, ఏపీఓ శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ దత్తాత్రి తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య మరింత పెంచాలని ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని భూత్కూర్ పంచాయతీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి పనులు సూచించారు. ఎంపీవో అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజలి తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేశ్‌బాబు

'హామీల అమలులో మంత్రి విఫలం'

లక్ష్మణచాంద: ఎన్నికల వేళ నిర్మల్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మంత్రి ఐకేరెడ్డి విఫలమయ్యారని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. సోమవారం సోన్‌లో బీజేపీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులకు డబుల్ బెడ్ రూం ఇల్లు, దళితులకు మూడెకరాల భూమి, నిర్మల్‌కు రైల్వేలైన్ తీసుకురాలేదన్నారు. భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించలేదన్నారు. సొంత పార్టీ నేతలే మంత్రి ఐకేరెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో నిర్మల్ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, మండలాధ్యక్షుడు మేక ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కంతి రవి, నవీన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యం

తానూరు: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా మండలంలోని ఎల్వి, తానూరు నాలుగో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సులోచన, మనీష తదితరులు ఉన్నారు.

కొలాంగూడలో..

ఖానాపూర్: పోషణ్ పక్వాడలో భాగంగా మండలంలోని కొలాంగూడ గ్రామంలో సోమవారం పాత ఎల్లాపూర్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సూపర్‌వైజర్ శ్రీలత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

కామారెడ్డి క్రైం: తరచూ బైక్ దొంగతనాలకు పాల్పడిన ఓ వ్యక్తికి ఎనిమిది నెలల 22 రోజుల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన మహమ్మద్ అన్వర్ కామారెడ్డిలోని ఆయా కాలనీల్లో ఐదు బైకులను చోరీ చేశాడు. పట్టణ పోలీసులు అతడిని గత జూలైలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కామారెడ్డి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ తీర్పు వెల్లడించారు. నిందితుడికి జైలుశిక్ష, రూ.100 జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అడిషనల్ పీపీ శివరాంనాయక్, కామారెడ్డి ఎస్‌హెచ్‌ఓ నరేష్, కోర్టు కానిస్టేబుల్ కరుణాకర్‌ను ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: ప్రతి సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ఫిర్యాదుల విభాగం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో పలు సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీఓ మల్లేశ్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీర హనుమాన్ శోభాయాత్ర

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో సోమవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అంజన్న దీక్షాపరులు, యువకులు వీర హనుమాన్ భారీ విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు. ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోడపత్రులు విడుదల

నిర్మల్‌టౌన్: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించే విష్ణుపూజ మహోత్సవ కరపత్రాలు, గోడప్రతులను సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం స్థానిక గాంధీచౌక్‌లోని ఆలయంలో కేరళ సంప్రదాయాలతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విగ్నేష్, రాజు, ప్రకాశ్, ఆనంద్, వీరార్జున్, శివప్రసాద్, శ్రీనివాస్, నగేశ్ పాల్గొన్నారు.

పాదయాత్రగా కొండగట్టుకు స్వాములు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల నుంచి హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. సోమవారం మండలంలోని పార్‌పెల్లి నుంచి 150 మంది స్వాములు, పీచర నుంచి ఒకరు, లక్ష్మణచాంద నుంచి 30 మంది స్వాములు కొండగట్టుకు బయలే దేరారు.

ప్లేట్లు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ప్లేట్లను సర్పంచ్ ముత్తగౌడ్ పంపిణీ చేశారు.

పొలాల్లో ప్రత్యేక పూజలు

ముధోల్: మండల వ్యాప్తంగా సోమవారం రైతులు తమ పంట పొలాల్లో పూజలు చేశారు. ఉగాది పండుగ తర్వాత వచ్చే బార్ష పౌర్ణమి రోజు తమ చేన్లలో నూతన పనులు ప్రారంభి స్తారు. ఉదయం బసవన్నలతో పూజల అనంతరం కుటుంబసభ్యులు వన భోజనాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాడి వనజ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని పాతతర్లపాడ్ గ్రామంలో గండి రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 4న స్వస్తివచనం, లాగున్యాస పూర్వక మహారుద్రాభిషేకం, అంకురార్పణం, అఖండస్థాపన, ఆదిత్యాది నవగ్రహ మండల పూజలు, మూర్తిపూజ, అగ్నిప్రతిష్ట, స్వామి వారి ఎదుర్కోలు, పార్వతి పరమేశ్వరుల కల్యాణం, 5న మహారుద్రాభిషేకం, వేద పారాయణం, సామూహిక కుంకుమార్చనతోపాటు పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

ఖానాపూర్: హనుమాన్ జయంతి, రంజాన్ పర్వదిన ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ నారాయణనాయక్ అన్నారు. సోమవారం ప ట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ స మావేశంలో మాట్లాడారు. మంగళవారం పట్ట ణంలో చేపట్టే వీరహనుమాన్ వి జయయాత్ర నిర్వహణపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ రాజేందర్, ఎస్సై శంకర్, హిందూ ఉత్సవ స మితి అధ్యక్షుడు రాజశేఖర్, జితేందర్, లక్ష్మణ్, ఆనంద్, షబ్బీర్ పాషా, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సోన్ సీఐ

లక్ష్మణచాంద: సోన్ సీఐగా నియమితులైన నవీన్‌కుమార్ సోమవారం సోన్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, అశో క్, రవీందర్, సిబ్బంది స్వాగతం పలికారు. నూతన సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

పెన్నులు అందించిన జెడ్పీటీసీ

ఖానాపూర్: పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో పలువురు విద్యార్థులకు పెంబి జెడ్పీటీసీ జానుబాయి సోమవారం పెన్నులు పంపిణీ చేశారు. కిషన్, ఎనుముల స్వామి, ఎనగందుల రవి, రాము తదితరులు ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లికి చెందిన న్యాతకాళ్ల రాజవ్వ ఆదివారం మృతి చెందింది. సదరు మహిళ జిల్లా కేంద్రంలోని ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్‌లో సభ్యురాలు. దీంతో సోమవారం రాజవ్వ కుటుంబానికి తక్షణ సాయం బ్యాంక్ ద్వారా రూ.10 వేలను సర్పంచ్ గంగాధర్ అందించారు. మధు, సుదర్శన్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనులు ప్రారంభం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్ పనులను ప్రారంభించారు.

ఆలయాలకు దాతల చేయూత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి గంగాయిపేటలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి పెంబి జెడ్పీటీసీ జానుబాయి రమేశ్ దంపతులు రూ.21వేలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చిలుకూరి తిరుమలగిరి, వెంకటేశ్వరరావు, గంగాధర్, కృష్ణ, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

శీతలీకరణ యంత్రం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని వీరాంజనేయ శివసాయి సమాజ్ జంగల్ హనుమాన్ ఆలయానికి సోమవారం రిఫ్రిజిరేటర్(శీతలీకరణ యంత్రం)ను దాత విరాళంగా అందజేశారు. జిల్లా కేంద్రంలోని తిరుమల నర్సింగ్‌హోం యజమాని డాక్టర్ రమేశ్‌రెడ్డి రూ.60వేల విలువైన 190 లీటర్ల రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ప్రదీప్, శంకరయ్య, అశోక్‌రావు, రాజేశ్వర్, జితేందర్, డాక్టర్ వేణుగోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

మంచినీటి ట్యాంక్ ఏర్పాటు

కుంటాల: మండల కేంద్రంలోని వీరహనుమాన్ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం మాజీ ఎంపీపీ జీవి రమణారావు తన తండ్రి నారాయణరావు స్మారకార్థం రూ.41 వేల విలువైన మంచి నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాత రమణారావును దీక్షాపరులు సన్మానించారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, గురుస్వామి గణపతి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, మహేందర్, మహేశ్వర్, గజేందర్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు వినియోగించుకోవాలి

దస్తురాబాద్: కంటివెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మున్యాల గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని సోమవారం తహసీల్దార్ సందర్శించారు. ఈసందర్భంగా పలు వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ శంకర్, నాగరాజు, ఆర్ఐ గంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని తొమ్మిదో వార్డు పరిధి శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నాకర్‌రావు, పలువురు వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో వైద్యులు శ్రీకాంత్, శ్వేత ఆధ్వర్యంలో కంటివెలుగు నిర్వహించారు. ఇప్పటివరకు 530 మందికి కంటి పరీక్షలు చేసి దృష్టి లోపమున్న 80 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరో 100 మంది కోసం కంటిఅద్దాలు ఆర్డర్ పెట్టినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇందులో సర్పంచ్ రాజేందర్, సిబ్బంది శివక్రిష్ణ, ఏఎన్ఎం యాస్మిన్, వనజ, ఆశా కార్యకర్తలు గంగామణి, రమ తదితరులు పాల్గొన్నారు.



మున్యాలలో పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

అధికారుల కోసం నిరీక్షణ



అధికారుల కోసం వేచిచూస్తున్న అర్జీదారులు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుండగా అర్జీదారులు 10 గంటలకే కార్యాలయానికి వచ్చి ఉన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు 11:30 గంటలకు రావడంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో సుమారు గంటన్నరపాటు అర్జీదారులు పడిగాపులు కాసారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



11:30 గంటలకు వస్తున్న అదనపు కలెక్టర్

శివాజీ వర్ధంతి

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం ఛత్రపతి శివాజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ధోనిగామ సంతోశ్, డైరెక్టర్ భోగ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.